17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 27 నవంబర్ 2023 పేజీలు 8

## ఉత్సాహంగా 3కే రన్



యువతను ఉత్సాహపరుస్తూ రన్‌లో పాల్గొన్న కలెక్టర్

ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు 2






### గొడవలకు దిగుతున్న

# లాటరీ మాఫియా

- రెండున్నర కోట్ల బహుమతితో తమలో తామే గొడవలు పడుతున్న లాటరీ అమ్మకందారులు
- అధికారులు ఎవరైనా లాటరీ బాదుషాకి అనుకూలమేనా..?
- తాత్కాలికంగా లాటరీ వ్యాపారాన్ని నిలిపివేసిన వైనం
- నేడు బహుమతి మొత్తం చేతికి అందుతున్నట్టుగా సమాచారం
- లాటరీ అమ్మకాలపై జీవనం సాగిస్తున్న 200 మంది కుటుంబాల పొట్ట కొట్ట వద్దని బాద్షానీ సూచిస్తున్న పెద్ద మనుషులు

వివరాలు 2లో

### ముంచుకొస్తున్న

# ఎన్నికలు



సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్నాయ్

మరో 65 రోజులలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషనా ?

మరో 5 నెలల సమయం ఉండగానే ఊపందుకున్న రాజకీయ వేడి

అవనిగడ్డ మేజర్ న్యూస్ : 2024 సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు ప్రచార మాధ్యమాల ద్వారా హల్‌చల్ చేస్తుండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్నీ పార్టీలు ఎవరికి వారు ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. పార్టీల అధ్యక్షులు రాష్ట్ర స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ నాయకులకు, కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. సెప్టెంబర్ 9 వ తేదిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పలు కార్యక్రమాల్లో జనం బాట పట్టగా, అరెస్టు కావడంతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా యువగళం పేరుతో ప్రజల్లో నుండి ఒక్క సారిగా నిలిపివేయడం, మరోవైపు జనసేన మిగతా 2లో

# ఉన్నత స్థానాలకు ఎదగాలి



అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు, కార్యక్రమాల లబ్ధి అందాలి

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టి కృషి అవసరం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు

విజయవాడ రూరల్, నవంబర్ 26, మేజర్ న్యూస్ : మన దేశం అన్ని విధాలా స్వయం సమృద్ధి సాధించి.. అభివృద్ధి చెందిన దేశంగా నిలబడాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామంలో ఆదివారం జిల్లా పంచాయతీ కార్యాలయం మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## ముంచుకొస్తున్న ఎన్నికలు

అధినేత పవన్ కళ్యాణ్ వారాహి విజయయాత్రలతో గత జూన్ నుండి ప్రజల్లోనికి వెలుతున్నారు. అటు అధికార వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తమ నేతలను గత సంవత్సరం ముందు నుంచే ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలు రూపొందించుకుని ముందుకు వెలుతున్నారు. ఎన్నికలు ఏ సమయంలో జరిగిన తాము సిద్ధమే అంటూ అన్నీ పార్టీలు ఎన్నికల సవరోత్సవాన్ని ప్రదర్శిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు అరెస్టుతో ఆ పార్టీ కొన్ని కార్యక్రమాలను విరమించుకున్నప్పటికి నేటి నుండి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ మరలా 79 రోజుల అనంతరం యువగళం పేరుతో ప్రజల బాట పట్టనున్నారు. ప్రజలు తమ వైపే ఉన్నారని అధికార, విపక్ష పార్టీల నేతలు ఎవరి వాదనలు వరే చెప్పుకుంటున్నారు. అసలు ప్రజలు ఎవరికి పట్టం కడతారనే దానిపై పూర్తి స్పష్టత మాత్రం లేదు. ఎవరి సర్వేలు వారు చేపించుకుంటూ ప్రైవేటు సంస్థల ద్వారా, పార్టీలో ఉన్న వ్యక్తుల ద్వారా కూడా అన్నీ పార్టీలు క్షేత్ర స్థాయి పరిస్థితులపై నివేదికలు తెచ్చుకుంటున్నాయి. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా అన్నీ పార్టీల అభ్యర్థుల గురించి అభిప్రాయాలు ఇప్పటికే సేకరించాయి. ఇలా ఎన్నికలకు పూర్తిగా సన్నద్ధం అవుతూ గెలుపు పై లెక్కలు వేసుకుంటున్నారు. ఆ యా పార్టీల సభలకు జనం భారీగా తరలివస్తుండటంతో ఎవరికి వారే తమ గెలుపు కాయం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పుడే సభలకు ప్రజలు భారీగా వస్తే గెలిచినట్లేనా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా సభలకు వెళ్ళువెత్తుతున్న జనం ఆ పార్టీ, ఈ పార్టీ అన్న తేడ లేకుండా అన్నీ పార్టీల సభలకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. అధికార వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీల సభలకు అనూహ్య స్పందన లభిస్తుండటంతో జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహి విజయ యాత్రలకు ఇటీవల ప్రజలు కనివిని ఎరుగని రీతిలో వస్తున్నారని పార్టీ కార్యకర్తలతో పాటు జనసేన నాయకులు చెప్పుకొస్తున్నారు. పవన్ కళ్యాణ్ పట్ల, జనసేన పట్ల ప్రజల్లో ఆదరణ బాగా పెరిగింది అనడానికి ఇది సాంకేతికం అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో జనసేన పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థులు కూడా భారీగానే పెరుగుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరిని ఆదరిస్తారో వేచి చూడాలి.

## ఉత్సాహంగా 3కే రన్

**యువతను ఉత్సాహపరుస్తూ రన్‌లో పాల్గొన్న కలెక్టర్**

**ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించాలి**

**కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఓటు వేయడానికి అర్హత కలిగిన ప్రతీ ఒక్కరినీ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రోత్సహించి ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణాజిల్లా కలెక్టరు పి రాజాబాబు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా యంత్రాంగం నిర్వహించిన సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమల్లో భాగంగా ఆదివారం ఉదయం కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడప లోని ప్రధాన కూడలి నుంచి 3కే రన్ వి ఆర్ సిద్ధార్థ, శ్రీ చైతన్య, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల వందలాది విద్యార్థిని విద్యార్థులు, పెనమలూరు బూత్ లెవెల్ ఆఫీసర్లు, మండల స్థాయి, డివిజనల్ స్థాయి అధికారులతో ఉత్సాహంగా కొనసాగింది. ఓటింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు జరిగిన ఈ పరుగును జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అంతేకాక ఆయన స్థానిక యువతను ఉత్సాహపరుస్తూ కలెక్టర్ సైతం 3 కే రన్ లో పాల్గొనడం విశేషం. యువతీ యువకులు పెద్దయెత్తున ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం యువతా మేలుకో నీ భవిష్యత్తు మలుచుకో అంటూ చక్కని నినాదాలతో టౌన్ అంతా మారుమ్రోగేలా స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగ దినోత్సవం అని, ఈ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఉన్న విలువను అందరూ గుర్తెరిగి ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. మన భవిష్యత్తు బాగుండాలంటే ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఆవశ్యకతను తెలుసుకొనేలా యువతను ప్రభావితం చేయాలని అన్నారు. సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, సగటు పౌరుడిగా తమ ప్రాథమిక కర్తవ్యాలను నిర్వర్తించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ అన్నారు. ప్రతి ఏడాది ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ధరఖాస్తు ఫారం-6 ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఎన్నికలకు ముందుగానే ఓటర్ల జాబితాలో నమోదు కావాలన్నారు. ఈ 3 కె రన్ కార్యక్రమంలో కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, ఉయ్యూరు ఆర్డిఓ డి.రాజు, వి ఆర్ సిద్ధార్థ కళాశాల డీన్ మాకినేని పాండురంగారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థిని, విద్యార్థులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# ఉన్నత స్థానాలకు ఎదగాలి



(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం, ప్రభుత్వ విజయాలకు సంబంధించిన లఘు చిత్రం ప్రదర్శనతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల అంతరంగ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సమాజానికి వివిధ మార్గాల ద్వారా సేవలందించిన వ్యక్తులను సత్కరించడం జరిగింది. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారం, భాగస్వామ్యంతో వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని.. ఈ పథకాల ఫలాలు చిట్టచివరి లబ్ధిదారుకు అందినప్పుడే వాటి లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరంగా ఉండకూడదనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివిధ పథకాలపై అవగాహన కల్పించి.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ లబ్ధిపొందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ. 6000 ఆర్థిక సహకారం అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. పీఎం కిసాన్, వైయస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందని పంటలకు అవసరమయ్యే పెట్టుబడి కోసం ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతోందని వివరించారు. అదేవిధంగా డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ, వైయస్సార్ ఆరోగ్య ఆసరా, ఆయుష్మాన్ భారత్ పథకాలు ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాల ద్వారా ప్రతి పేదవానికి సొంతఇంటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. ఇలా అనేక పథకాలు అమలవుతున్నాయని వీటిపై ప్రజలు అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. 2047 నాటికి భారతదేశం స్వయం సమృద్ధి సాధించి అభివృద్ధి చెందిన దేశంగా సగర్వంగా నిలబడాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్ప సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించుకున్నందుకు ఆనందంగా ఉందని.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కృషిచేసి దేశం అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు సమిష్టి కృషితో లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మనకు వలసవాద అనే భావజాలం లేదు.. మన వారసత్వం చాలా గొప్పది. సరిహద్దులో, అంతర్గతంగా సేవలందిస్తున్న సైనికులు, పోలీసు వ్యవస్థలు అందిస్తున్న సేవలు మనల్ని భద్రంగా ఉండేలా చేస్తున్నాయి. ప్రాథమిక హక్కులను అనుభవించడంతో పాటు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక విధులను, ఆదేశిక సూత్రాలను ప్రతి ఒక్కరు అనుసరించాలి.. అప్పుడే అభివృద్ధికి సంబంధించిన మన లక్ష్యాలు నెరవేరుతాయి అని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. జిల్లాస్థాయి, మండల స్థాయి నోడల్ అధికారుల సమన్వయంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక కమిటీల భాగస్వామ్యంతో కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ ఢిల్లీరావు.. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకానికి సంబంధించిన స్టాల్ ను ప్రారంభించడంతోపాటు లబ్ధిదారులకు కనెక్షన్లు అందజేశారు. కిసాన్ డ్రోన్లను పరిశీలించారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిపిఓ జయచంద్ర గాంధీ, డిఎం హెచ్ ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డా. వైయస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సుమన్, జడ్పిటిసి కె.సువర్ణ రాజు, ఎనికెపాడు సర్పంచ్ పూర్ణచంద్రరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గొడవలకు దిగుతున్న లాటరీ మాఫియా

**రెండున్నర కోట్ల బహుమతితో తమలో తామే గొడవలు పడుతున్న లాటరీ అమ్మకందారులు**

**అధికారులు ఎవరైనా లాటరీ బాదుషాకి అనుకూలమేనా..?**

**తాత్కాలికంగా లాటరీ వ్యాపారాన్ని నిలిపివేసిన వైనం.**

**నేడు బహుమతి మొత్తం చేతికి అందుతున్నట్టుగా సమాచారం..**

**లాటరీ అమ్మకాలపై జీవనం సాగిస్తున్న 200 మంది కుటుంబాల**

**పొట్ట కొట్ట వద్దని బాద్నాసీ సూచిస్తున్న పెద్ద మనుషులు**

నందిగామ నవంబర్ 26 మేజర్ న్యూస్:- లోకల్ అయినా సరే జిల్లా అయినా సరే స్టేట్ అయినా సరే చివరికి కేంద్ర అధికారులైనా సరే ఈ లాటరీ బాద్షాకు సలాం చేయాల్సిందే అని కంచికచర్ల కు చెందిన లాటరీ ఏజెంట్ బీరాలు పలుకుతున్నాడనీ పట్టణానికి చెందిన లాటరీ అమ్మకం దారులతో పాటు పట్టణ ప్రజలు అంటున్నారు. ఒక సామాన్య పౌరుడుగా జీవనాన్ని ప్రారంభించిన ఈ కంచికచర్ల బాద్షా నేడు లాటరీ టికెట్ల బాదుషాగా అవతరించాడని ప్రజలు అంటున్నారు. మొదట్లో ఎంతో సౌమ్యుడుగా కనిపించిన బాదుషా వరసగా నిషేధిత లాటరీ టికెట్లు బహుమతులు గెలుపొందడంతో మాఫియా కింగ్ గా మారాడని టికెట్లు అమ్మకం దారులు ద్వారా తెలియవచ్చింది.కేవలం గత వారంలోనే దాదాపుగా 15 లక్షల వరకు బహుమతులు గెలుచుకున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. స్థానిక లక్ష్మీప్రసన్న సెంటర్లో గల చేతి వృత్తిదారుడికి రెండు లక్షలు, మండల పరిధిలోని చందాపురం గ్రామానికి చెందిన వ్యాపారికి రెండు పర్యాలు కలిపి 15 లక్ష రూపాయలు బహుమతులు గెలుచుకున్నట్టుగా తెలియవచ్చిన సమాచారం. వరుస బహుమతులు గెలుచుకుంటున్న ఈ బాదుషా సామాన్య ప్రజలనే కాదు డివిజన్ అధికారులను కూడా లెక్కచేయని స్థితికి చేరుకున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. గురువారం నాడు స్థానిక గాంధీ సెంటర్ కు చెందిన వ్యక్తికి రెండున్నర కోట్ల రూపాయలు బహుమతి వచ్చిన విషయం పట్టణంలో హల్చల్ చేస్తున్న సంగతి పాఠకులకు తెలిసినదే. సదరు టికెట్లుకు కంచికచర్ల బాదుషా ఏజెంట్గా వ్యవహరించగా పాత బస్టాండ్ చెందిన చేతి వృత్తిదారుడు అమ్మగా స్థానిక గాంధీ సెంటర్లోని టికెట్లు అమ్మే వ్యక్తి సదరు నెంబర్ పై మోజుపడి టికెట్లు కొనుగోలు చేయగా అదే నెంబర్ కి రెండున్నర కోట్ల బహుమతి వచ్చిన విషయం గత రెండు రోజులుగా సూర్యా పాఠకులకు తెలిసిన విషయమే. సదరు సంఘటనపై ఆదివారనాడు స్థానిక గాంధీ సెంటర్లో ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. టికెట్లు అమ్మిన వ్యక్తి, కొన్న వ్యక్తితో పాటు తమ స్నేహితులతో బాతా ఖానీ చేస్తున్న సమయంలో ఇది ఎలాగో కార్తీక మాసం కాబట్టి పెద్ద మొత్తంలో బహుమతి గెలుచుకున్నా సందర్భాన్ని పురస్కరించుకొని తమకు పార్టీ ఇవ్వాలని స్నేహితులు కోరినట్టుగా సమాచారం. నేను వేలకు వేలు పది రూపాయల వడ్డీ,ఇరవై రూపాయలు వడ్డీ పెట్టి టికెట్లు కొన్నప్పుడు తనకు ఎవరు సహకారం అందించలేదని ఈరోజు బహుమతి రాగానే అందరూ ఎగబడుతున్నారని బహుమతి గెలుచుకున్న వ్యక్తి వాదనకు దిగినట్టుగా తెలియవచ్చిన సమాచారం.

మాట మాట పెరిగి గొడవగా మారుతున్న తరుణంలో పక్కనే ఉన్న పెద్ద మనుషులు కలగజేసుకొని మీలో మీలో తగాదా పడుతుంటే ఈ టికెట్ల వ్యాపారం మీద దాదాపుగా 200 మంది బ్రతుకుతున్నారని వాళ్ళ పొట్ట కొట్టిన ట్టుగా ఉంటుందని సమన్వయంగా వ్యవహరించాలని పెద్ద మనుషులు సూచించినట్టుగా తెలియవచ్చింది. విషయం తెలుసుకున్న బాదుషా ఈ నాలుగు రోజులు టికెట్ల వ్యాపారాన్ని నిలిపేయవలసిందిగా తన అనుచరులైన టికెట్లు అమ్మకం దారులను ఆదేశించినట్టుగా తెలిసింది. ఇంత జరుగుతున్నా తమకు బహుమతి రాలేదని అధికారులను నమ్మించడానికి లాటరీ మాఫియా ప్రయత్నిస్తూ ఉండటం కొసమెరుపు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి లాటరీ టికెట్ల మాఫియా నుండి నందిగామ డివిజన్ ను కాపాడవలసినదిగా ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. సోమవారం సాయంత్రం లోపు బహుమతి మొత్తం చేతికి అందుతున్నట్టుగా సమాచారం..

# పెండ్యాల గ్రామంలో భగ్గుమన్న వైసీపీ వర్గ పోరు





**ఎమ్మెల్సీ సాక్షిగా ఎంపీపీపై వ్యతిరేక వర్గం దాడి**

**ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు తలనొప్పిగా మారిన పెండ్యాల వైసీపీ వర్గ పోరు**

**కంచికచర్ల నవంబర్ 26 మేజర్ న్యూస్ :** మండలంలోని పెండ్యాల గ్రామంలో అధికార వైసిపిలో ఎంపిపి, ఎంపిటిసి వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. గత ఏడాదిన్నర కాలంగా ఎంపిపి షేక్ మలక్ బషీర్ ఒంటె ద్దు పోకడ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లకు తలనొప్పిగా మారిందని పలువురు నాయ కులు అంటున్నారు. ఇప్పటికీ వ్యతిరేక వర్గీయులు ఎంపిపి మలక్ బషీర్ పై పలు మార్లు దాడికి యత్నించినా అతని ప్రవర్తన మార్పు రాలేదని పలువురు తెలుపుతున్నారు. శనివారం రాత్రి పెండ్యాల గ్రామంలో ఎంపిటిసి షేక్ బడే హజరత్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ హాజరయ్యారు. అదే గ్రామానికి చెందిన ఎంపిపి షేక్ మలక్ బషీర్ ని ఎంపి టిసి వర్గం పిలవలేదు. ఎమ్మెల్సీ రాగానే ఎంపిటిసి బడే హజరత్ వర్గం బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఈ ర్యాలీలో ప్రచార రథం మీద ఉన్న ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, రోడ్డు పక్కన ఉన్న ఎంపిపి బషీర్ పిలిచి ప్రచార రథం ఎక్కించారు. ఇది తట్టుకోలేని వ్యతిరేక వర్గం, ఎంపిపి బషీర్ ఈ ర్యాలీలో పాల్గొ నటానికి వీలు లేదన్నారు అతన్ని మేము పిలవలెదని, ప్రజాప్రతినిధిగా మేము గుర్తించటం లేదని గోల చేశారు ప్రచార రథం దిగి వెళ్లిపోవాలని రథం నిలిపి వేశారు. దీంతో నేను ఎంపిపిని నన్నెవరూ ఆపేదని ఎంపిపి బషీర్ వ్యతిరేక వర్గం యువకులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ సా క్షిగానే ఎంపిటిసి వర్గీయులు, ఎంపిపి బషీర్ ను రథం నుండి కిందకు తోశా రు. దీంతో పరిస్థితి చేయి దాటుతుందని గ్రహించిన ఎమ్మెల్సీ సర్ది చెప్పి ఎంపి పిని ఇంటి వద్ద దింపారు. వారం రోజుల క్రితం ఎంపిపి షేక్ మలక్ బషీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ను ఆహ్వానించి గ్రామంలో తన సెగ్మెంట్ పరిధిలో నిర్వహించిన ఇలాంటి కార్యక్రమానికి ఎంపిటిసి బడే హజరత్ వర్గీయులను పిలవ లేదు. అందుకే శనివారం నిర్వ హించిన కార్యక్రమానికి ఎంపిపిని పిలవలేదని అంటున్నారు. సుమారు రెండు నెలలు క్రితం ఎంపిపి, ఎంపిటిసి ఇరువురు గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు నిధులు డ్రా చేసుకున్న విషయం లో ఘర్షణ పడ్డ విషయం తెలిసిందే. దీంతో ఇరు వర్గాల మధ్య దూరం మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

# ఆధ్యాత్మిక జ్ఞానమే అంతిమ జ్ఞానం : వెనిగండ్ల రాము





**నందివాడ మేజర్ న్యూస్:** శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం 11వ వార్షికోత్సవంలో ఆదివారం గుడివాడ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం వారు ఏర్పాటు బ్రహ్మర్షి పత్రీజీ విగ్రహాన్ని రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నేటి సమాజంలో అసహనం పెరిగిపోయిందన్నారు. మనసుకు చికిత్స చేయగలిగిన ఒకే ఒక మార్గం ధ్యానం. ధ్యానాన్ని సాధన చేయడం ద్వారా మెరుగైన సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. అనంతరం శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం సభ్యులు రాము ని ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుత్తా చంటి, లింగం చిట్టిబాబు, దేవరపల్లి కోటి,కొండవీటి ఫణి, జువ్వలపూడి దుర్గారావు, జయరాజు, సురగని సూరిబాబు ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆదివారం భారతరాజ్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సీతాయలంకలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. రాజ్యాంగంగా నిర్మించుకునేందుకు పౌరులందరికి సాంఘీక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనతో స్వేచ్ఛను అంతస్థు ( హోదా)లోనూ అవకాశం లోనూ సమానత్వంను చేకూర్చుటకు వ్యక్తి గౌరవంను సంరక్షిస్తూ పెంపొందించుటకు సత్య నిష్ట పూర్వకంగా నవంబర్ 26 1949 న మన రాజ్యాంగ పరిషత్‌లో శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దిడ్ల వెంకటేశ్వరరావు (కిరణ్), నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు లతో పాటు ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

గ్రేడ్ 1 గ్రంధాలయంలో జాతీయ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం డాక్టర్ బి ఆర్ ఆంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెడ్ పోస్ట్‌మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు పాల్గోని నివాళ్ళు అర్పించిన అనంతరం పాఠకులు, విద్యార్ధులతో భారత రాజ్యంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల పవిత్ర గ్రంధం అయిన భారత దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడమే ప్రతి భారతీయుడు యొక్క ప్రాధమిక భాధ్యత అని ఈ మార్గంలో ఎదురయ్యే దుష్ట శక్తులను ఎదుర్కోవడమే దేశ సేవ అని ఇంత కంటే వేరే మార్గం లేదన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్ధులు, గ్రంధాలయ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ఆన్ డ్యూటీ లేకుండా ఆడుదాం ఆంధ్ర చేయలేము

**గన్నవరం, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుతం ప్రతిష్టత్మాకంగా తీసుకుని గామీణ ప్రాంతం లో కన్నుల పండుగ గా చేయాలని భావించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరం ఆన్ డ్యూటీ లేకుండా విజయవంతం చేయలేమని గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. రోజు రోజు కు పెరుగుతున్న పని ఒత్తిడి భారంగా మారిన పరిస్థితులలో ప్రతి సచివాలయం నుండి వ్యాయామ విద్య ఉపాధ్యా యులు పర్యవేక్షణ చేయాలంటే క్షేత్ర స్థాయికి వెళ్ళాలి. అందుకు గన్నవరం నియోజకవర్గంలో ప్రధాన ఉపాధ్యాయుల సహకారం లేక పోవడం తో అను కున్న స్థాయిలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొనలేక పోతున్నట్లు చెపుతున్నారని నాగరాజు తెలిపారు. ఒక వైపు కలెక్టర్ ఉత్తర్వులు అంటు న్నారు. తప్పనిసరిగా పాటించి అన్ని గ్రామాలలో లేటెస్టు గ్రౌండ్ రిపోర్టు కా వాలని మండలంలో యం. డి. ఓ., జిల్లా లో స్పోర్ట్స్ చీఫ్ కోచ్ తరుమతు న్నారు. కాని ఉపయోగం ఏమి లేదు కారణం ఆడుదాం ఆంధ్ర వేగవంతం చేయండి ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ ఇచ్చి పని చేయమని చెప్పడం మరిచి పోయినట్లు ఉన్నారు. సం బంధించిన యం. డి. ఓ ఆదేశాలు ఇచ్చినా, ప్రధాన ఉపాధ్యాయులు డోంట్ కేర్ మాకు కన్సల్ట్ కాదు అంటున్నారు. దానితో వ్యాయామ విద్య ఉపాధ్యా యులు ఆడుదాం ఆంధ్ర విజవంతం చేయాలని ఆసక్తి తో ఉన్నప్పటికీ ప్రధాన ఉపాధ్యాయులు ఇంచి కూడా పాఠశాల వదలి అడుగు పెట్టడానికి ఒప్పుకోవడం లేదు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలియజేసిన ఉపయోగం లేదని వ్యాయామ విద్య ఉపాధ్యాయులు తెలుపు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ ఉత్తర్వులు ఇప్పించి ఆడుదాం ఆంధ్ర విజయవంతం అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## నేడే కోటి దిపోత్సవం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కార్తీక పౌర్ణమి సోమవారంను పురస్కరించుకుని గీతామందిరంలో కోటి దిపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గీతామం దిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. గీతామందిరంలో ఉదయం ఆలయ అర్చక స్వామి దివి నరసింహా మూర్తి బ్రహోత్తంలో రేపల్లె రామకృష్ణారావు, కుసుమ దంపతులచే అమ్మవా ర్లకు ప్రత్యేక పూజలు, అష్టోత్రనామారచ్చన సహిత నవగ్రహ నక్షత్రాలకు భక్తులచే కోటి దిప మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు నిర్ణయించడం జరిగిందని కావున భక్తబృందం అందరూ పెద్ద ఎ త్తున విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేసి స్వామి వార్ల కృపాకటాక్షాలు పొందాలన్నారు.

### బాపులపాడులో సర్పంచ్ కమల కిరణ్ ఆధ్వర్యంలో

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**హనుమాన్ జంక్షన్, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాపులపాడు మండలం బాపులపాడు గ్రామంలో ఎం.జి నగర్‌లో వున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బాపులపాడు గ్రామ సర్పంచ్ సరిపల్లి కమల కిరణ్, దళిత నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమన్ని రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్, మండల అధ్యక్షుడు నక్కా గాంధీ పూలమాలలు వేసి ప్రారంభించగా, మండల ఎంపీపీ యర్లగొర్ల నగేష్, మండల జడ్పీటీసీ కోమరవల్లి గంగ భవాని, బాపులపాడు పి.ఎ.సి.ఎస్ అధ్యక్షుడు దయాల విజయ నాయడు, వైస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి, ట్రేడ్ యూనియన్ నాయకులు వెలగపల్లి ప్రదీప్, ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనాంపూడి ఆసిర్వాదం, కోట ప్రకాష్, వైఎస్సార్ పార్టీ నాయకులు వరిగంజి కిషోర్, మండల వ్యవసాయ కమిటీ డైరెక్టర్ ప్రత్తిపాటి ఏసుపాదం, వైఎస్ఆర్సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్ మూర్తి, యువజన నాయకులు మద్దాల కిన్ను, చిన్నం కోటి, కాగితాల సునీల్, కాగితాల అనిల్, షేక్ నాగూర్, చీలి రాజు తది తరులు పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సేవలను రాజ్యాంగ రచన సమయంలో ఆయన చూపిన నిబద్ధతను గుర్తుచేసుకొంటు కొనియాడారు.

# రాష్ట్రంలో బీసీలకు తీరని అన్యాయం



## గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ

**గన్నవరం, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలోని బీసీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు ఈ ప్రభుత్వం చేసినంత అన్యాయం ఇంతకుముందే ప్రభుత్వం చేయలేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయంపై ఆదివారం ఆయన పత్రికా ప్రకటనలో వివరిస్తూ రూ.75,760 కోట్ల రూపాయల బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని, ఆదరణ లాంటి 35 పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేశారని వివరించారు. రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం ద్వారా 16,800 మంది బీసీ లు రాజ్యాంగ పదవులకు దూరం అయ్యారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదని, 13 బీసీ భవనాలు, 118 కమిటీ హాళ్ల నిర్మాణాలను నిలిపివేశారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన వారికి అన్యాయం చేస్తూ తన సొంత సామాజిక వర్గానికి జగన్ న్యాయం చేస్తున్నారని సీనియార్టీలో 5వ స్థానంలో ఉన్న బీసీ వర్గానికి చెందిన ద్వారకా తిరుమలరావుకు ఇవ్వాల్సిన డీజీపీ పోస్టును 16వ స్థానంలో ఉన్న రాజేందర్ రెడ్డిని నియమించటమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. పదవులు బర్తీలోనూ సొంతకులానికే ప్రాధాన్యమిస్తూ బీసీలను అణగదొక్కుతున్నారని విమర్శించారు. టీటీడీ చైర్మన్ గా బీసీలు పనికిరారా అని సూటిగా ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 74 మంది బీసీలును హత్య చేశారని, కొన్ని వేల మంది పై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన బీసీ నేతలపై అక్రమపోలీసు కేసులు పెడుతూ వారిని నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరిగిందని ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత ఎంతో మంది బీసీలు నాయకులుగా వెలుగులోకి వచ్చారని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వంలో అన్ని పదవుల్లోనూ బీసీలకు తగిన స్థానం కల్పించారని వెంకట్రావ్ గుర్తు చేశారు. 2014- 2019 మధ్య కాలంలో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9224 మంది విద్యార్థులు రూ. 2.30 కోట్లు లబ్ది పొందగా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నాలుగున్నర ఏళ్ల కాలంలో కేవలం 150 విద్యార్థులకు రూ.4.42 లక్షలు మాత్రమే ప్రభుత్వం ఖర్చుచేయటం దారుణమన్నారు. బీసీ ల పట్ల కపట ప్రేమ నటిస్తూ వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మాత్రమే బీసీలకు మేలు జరుగుతుందని నొక్కివక్కాణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ మంత్రుల కు ఏవిధమైన అధికారాలు లేవని కేవలం వారిని ఉత్సవవిగ్రహాలుగా మార్చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దయిన బీసీ సంక్షేమ పథకాలు అన్నీ పునఃప్రారంబిస్తామని యార్లగడ్డ హామీ ఇచ్చారు.

# లంక గ్రామాల్లో వనభోజనాల సందడి





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** లంక గ్రామాల్లో ఎక్కడ చూసిన వనభోజనాల సందడితో వెల్లివిరిసింది. కార్తీక రెండవ ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని లంకగ్రామాల్లోని ఉసిరి చెట్ల వద్ద వన సమారాధనలు పెద్ద ఎత్తున జరిగాయి. మండల పరిధిలోని పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో రేపల్లె వంశస్థుల వన సమారాధన పెద్ద ఎత్తున జరగ్గా నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం వనసమారాధన కార్యక్రమంలో పాల్గొని పలు విషయాలను చర్చించుకుని వారి వారి కుమార్తె, కుమారుల యోగక్షేమాలు, వారి వారి విధులు అడిగి తెలుసుకున్నారు. మోపిదేవి వార్పు వద్ద జనసేన, తెలుగుదేశం పార్టీల ఆద్వర్యంలో వనసమారాధన నిర్వహించగా మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామంలో 1985-87 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పాత స్నేహితులు, 7వ వనసమారాధన కార్యక్రమాన్ని సూరగం రామకృష్ణ, దివి లీలాకృష్ణ, యాసం సోబన్ బాబుల ఆద్వర్యంలో నిర్వహిం చగా, కుటుంబ సభ్యులు పాల్గొని పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతల కు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు శివరామకృష్ణ, కమ్మిలి శ్రీనివాసరావు, సనకా వెంకటేశ్వరరావు, అడపాల ఈశ్వర్దత్తులు పాల్గోనగా చైల్డ్ హుడ్ మిత్రబృందాన్ని అతిధులుగా ఆహ్వానించారు. మొత్తం మీద లంక గ్రామాల్లో ఏ ఉసిరి చెట్టు వద్ద చూసిన వన సమారాధన మహోత్సం కొట్టొచ్చినట్లుగా కనబడగా ,ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి కార్తీక మాసంలో ఉసిరి చెట్టు యొక్క విశిష్టతను పెద్దలు తెలియచేశారు.

# ఘనంగా భారత 75వ రాజ్యాంగ దినోత్సవం



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** సెంట్రల్ నియోజకవర్గ ఏస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జయపాల్ ఆధ్వర్యంలో ఆదివారం 63 వ డివిజన్ లో రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించి, కేక్ కట్ చేసారు.అనంతరం వృద్ధులకు,మహిళలకు,చిన్న పిల్లలకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరావు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి, మహిళలకు, వృద్ధులకు ఫ్రూట్స్ పంపిణీ చేస్తూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ ఈ రోజు బి.ఆర్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన రోజని, ఈ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆనాడు స్వాతంత్ర సమరయోధులు చేసినటువంటి త్యాగాలను స్మరణం చేసుకోవడం ప్రతి భారతీయుడు యొక్క బాధ్యతని, ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్వతంత్రం వచ్చాక,ఏ రోజు కూడా ఇలాంటి పరిస్థితి,ఏనాడు ఆంధ్రప్రదేశ్ లో లేదని,ఈ ఆంధ్రప్రదేశ్ లో రాజ్యాంగం అనేది అమలు కావడం లేదని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల కోసం తీసుకువచ్చిన రాజ్యాంగాన్ని,ఈ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో తుంగలోకి తొక్కుతున్నారని, ఈరోజు ఆంధ్రప్రదేశ్లో 6వేల దాడులు ఏస్సీ ల మీద ఈ 4 సంవత్సరాల 8 నెలలకాలంలో జరిగాయని,ఇది ఆల్ టైం రికార్డ్ అని,భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత దుర్మార్గంగా ఎస్సీ ల మీద దాడులు జరగలేదని, దాదాపు 5 దాడులు బీసీలు, మైనారిటీల మీద దాడులు జరిగినాయని,ఒకప్పుడు ఎస్సీలు అంటే సమాజంలో గౌరవం ఉండేదని,మేము ఎస్సీలమని గౌరవంగా బతికే వారిని, ఈరోజు వారికి గుర్తింపు పోయే విధంగా జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఉన్నదనితెలిపారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ సబ్ ప్లాన్ కానీ,ఎస్సీలకు సంబంధించినటువంటి కార్పొరేషన్ను అమలు చేస్తే, దానిని కూడా మూసేశారని,27 చట్టాలను కూడా రద్దు చేశాడని, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగంలో జనాభా తమాషా ప్రకారం ఏదైతే ఎస్సీలకు నిధులు ఇచ్చారో, ఆ నిధులను అన్నింటిని కూడా పక్క ద్రోవ పట్టించి, అందరితోపాటు ఇవాళ పథకాలను ఇస్తా ఉన్నారని,అలాగే బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వంలో సబ్ ప్లాన్ పెట్టి వారికి ప్రత్యేకంగా నిధులను కేటాయించి,ఆ బీసీల అభ్యున్నత కోసం తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని,ఈరోజు ఈ వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ ను రద్దుచేసి, సబ్ ప్లాన్ ని తీసేసారని నిధులు కూడా లేవని,ఏది ఏమైనా వచ్చే రాజ్యాంగ దినోత్సవం నాటికి, మరల మా ఏస్సీలకు, బీసీ లకు, మైనార్టీలకు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగాన్ని అమలు చేసేటువంటి ప్రభుత్వం రావాలని కోరుకుంటూ, ప్రజలందరికీ కూడా రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు బోండా ఉమా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైడి తులసి, బత్తుల కొండ, లబ్బా వైకుంఠం,కోలా శ్రీనివాసరావు,పైడి శ్రీను, మోతుకూరి కాసిం, చింతల దుర్గాప్రసాద్,ఎస్.కె గౌస్ బాషా, ఎస్.కె అన్వర్,దాసరి ఉదయశ్రీ, రౌతు మంగరాజు,పెద్ది శ్రీను, మెహర్,దాసరి దుర్గారావు, తొట్టెంపూడి ఉదయ్ శంకర్, వరలక్ష్మి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గాయత్రి బ్రాహ్మణ సంఘ వన సమారాధన

**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్:** గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెలది సుగుణ శేఖర్ రావు, గుడిమెట్ల పూర్ణచంద్ర మోహన్ పోలవరం సదాశివరావు కొమరగిరి వాచస్పతిల ఆధ్వర్యంలో మునేటి ఒడ్డున అమ్మ గార్డెన్స్లో కార్తీక వన సమారాధన ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు రుత్వికులు శ్రీ సన్నిధానం కిషోర్ శర్మ, దుర్భాకుల ఆంజనేయ ప్రసాద్ ల పౌరోహిత్యంతో సత్యనారాయణ స్వామి వ్రతం శివలింగ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కుల సభ్యులందరికీ సహకారంతో ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శంకర్ రవి మహిళ బ్రాహ్మణ సంఘం నాయకులు రోహిణి ఉదయలక్ష్మి సరస్వతి కళ్యాణి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్:** పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నందిగామ ఎంఎల్ఏ డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని నూరు శాతం పాటించి అమలు చేస్తున్నది జగనన్న ప్రభుత్వమే అన్నారు. విభిన్న వర్గాలకు చెందిన భారతీయులను ఒకటిగా ఉంచే గొప్ప గ్రంథం భారత రాజ్యాంగం అన్నారు. రాజ్యాంగంలో చెప్పిన గ్రామ స్వరాజ్యానికి రూపకల్పన చేసి దేశంలోనే తొలిసారిగా గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థలను అమలు చేస్తున్నది జగనన్న ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారికి ఇరుపక్కల ముళ్ళ మొక్కలు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధి పి.నైనవరం గ్రామం నుండి నున్న వెళ్లే ప్రధాన రహదారికి సైడ్ మార్జిన్ ఇరుప్రక్కల పిచ్చి మొక్కలు,ముళ్ళ కంపతో ఎదురుగా ఏదన్నా వాహనం వస్తే సైట్ మార్చిన లేక ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రహదారికి ఇరుపక్కల ఉన్నా ముళ్లమొక్కలు తొలగించి, రోడ్డు సైడ్ మార్జిన్ పై చర్యలు చేపట్టాలని, నైనవరం గ్రామస్తులు కోరుతున్నారు.

## భక్తులతో పోటెత్తిన శివాలయాలు



**కంచికచర్ల మేజర్ న్యూస్ :** కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తిది ప్రకారం పౌర్ణమి ఆది సోమవారాలు మిగులు తగులు రావడం ఆదివారం సాయంత్రం నుంచి భక్తులు శివాలయాల్లో కిటికీటలాడారు. పౌర్ణమి ఘడియలు సోమవారం మధ్యాహ్నం వరకు ఉండటంతో అప్పటివరకు పౌర్ణమి ఒత్తులు వెలిగించుకునే అవకాశం ఉంది. పౌర్ణమి సందర్భంగా భక్తులు ఉదయం నుండి ఉపవాసాలు ఉండి సాయంత్రం పున్నమి చంద్రుని దర్శించుకుని 365 వత్తులు వెలిగించి అల్పాహారం భుజిస్తారు. అలాగే సోమవారం శివునికి విశేషమైన రోజు కావున తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాల్లో పూజలు నిర్వహించుకొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు.స్థానిక శివాలయంలోనూ శివసాక్షేత్రంలో భక్తులు దీపారాధనలు చేసి విశేష పూజలు నిర్వహించారు.

# చంద్రబాబుపై కొల్లు రవీంద్ర పై తప్పుడు మద్యం కేసు పెట్టారు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** చంద్రబాబుపై, కొల్లు రవీంద్ర పై జగన్ తప్పుడు మద్యం కేసు పెట్టారు అని మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రివిలైజ్ ఫీజు రద్దు ఫైల్ చంద్రబాబు వద్దకు రాలేదు అని టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు ఎక్సైజ్ శాఖ చూడలేదు అన్నారు. ప్రివిలైజ్ ఫైల్‌పై చంద్రబాబు సంతకం చేయలేదు కుట్రలో భాగంగానే చంద్రబాబును ఏ3గా చేర్చారు అన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే వరుస కేసులు పెట్టారు అని మద్యం కేసులో ప్రభుత్వం చేసేవన్నీ తప్పుడు ఆరోపణలే అని స్పష్టం చేశారు. మద్యం విధానంపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నాలుగో సమావేశంలో విధివిధానాలను రూపొందించారన్నారు. కేబినెట్లో చర్చించకుండా ప్రివిలేజ్ ఫీజును రద్దు చేశారనే ఆరోపణతో వాసుదేవరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు అని కేబినెట్ తీర్మానంపై అప్పటి ప్రధాన కార్యదర్శి సంతకం చేశారు. అజేయ కల్లాంరెడ్డి జీవో విడుదల చేశారు – కేవలం ఓటమి భయంతోనే తప్పుడు కేసులతో ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు అన్నారు. జగన్మోహన్ రెడ్డి తప్పు మీద తప్పు చేస్తున్నారని అతని తప్పులు కప్పించుకునేందుకు ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం మీద కక్ష సాధింపు చర్యలుగా అక్రమ కేసులు బనాయిస్తూ తన పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఈ విషయాలను గమనిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఘోర పరాభవం తప్పదు అని కొనగళ్ల నారాయణరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, లంకే నారాయణ ప్రసాద్, కాగిత గోపాల్ రావు, లంకే శేష గిరి, బచ్చుల బోస్, బత్తిన దాస్, పీవీ ఫణి, గోకుల్ శివ, వంక వెంకటేశ్వర్ రావు, పెంట మురళి, ఇదే భాస్కర్, లంకే హరి,, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం



**గన్నవరం, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్ ఆర్ సీపీ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెడ్ పి టీ సి సభ్యులు ఎలిజబెత్ రాణీ, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు పొలిమెట్ల జయరాజు మాట్లాడుతూ దేశ ప్రజలందరికి న్యాయం, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1949, నవంబర్ 26 న ఆమోదించినబడిన సందర్భంగా ఈరోజు దేశ ప్రజలు అందరూ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు నీలం బాలు, వైఎస్ ఆర్ సీపీ మాజీ అధ్యక్షులు పడమటి సురేష్, చింతల వెంకటేశ్వరరావు, వైఎస్ ఆర్ సీపీ నాయకులు తిరివీది రంగారావు, తదితర వైఎస్ ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## బీసీల నమ్మక ద్రోహి జగన్ రెడ్డి

### మాజీ ఎమ్మెల్యే సౌమ్య నందిగామ



**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్:** పట్టణం లోని కాకానినగర్ మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆదివారం నాడు తెదేపా బీసీ సెల్ నేతలతో కలిసి బీసీల ద్రోహి జగన్ రెడ్డి అంటూ పుస్తకాన్న మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ రూ.75వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించిన బీసీల ద్రోహి జగన్ రెడ్డి.బీసీల గొంతు కోశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్టీఆర్, చంద్రన్న 34% రిజర్వేషన్లు అమలు చేస్తే జగన్ రెడ్డి 24%కి కుదించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారు.టీడీపీ హయాంలో కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా 4 లక్షల మందికి రూ.3700 కోట్లు రుణాలుగా ఇస్తే 56 కార్పొరేషన్లు పెట్టిన జగన్ రెడ్డి బీసీలకు రూపాయి ఖర్చు చేయలేదు.13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు నిలిపి వేశారు.గుంటూరు జిల్లా పల్నాడులో తోట చంద్రయ్యను వైసీపీలో చేరాలని వేధించి, జై జగన్ అని నినదించమనగా నిరాకరించి జై టీడీపీ జై చంద్రబాబు అన్నందుకు నడిరోడ్డుపై గొంతు కోసి హత్య చేశారు.పల్నాడు జిల్లా జంగమేశ్వరపాడులో అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామం నుండి తరిమేసి, వివాహం కోసం వచ్చిన కంచర్ల జల్లయ్యను దారికాచి రాళ్లు, రాడ్లతో కొట్టి చంపారు.రానున్న ఎన్నికలలో బీసీలంతా ఏకమై జగన్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు,వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో

## అనాథ బాలలకు, వృద్ధులకు అన్నదాన సేవా కార్యక్రమం



**గన్నవరం, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** ఆదివారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కెనడాకి చెందిన మింది శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులతో ఆశ్రమానికి వచ్చి అనాథ బాలలకు అనాథ వృద్ధులకు అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ చైర్మన్ కానూరి శేషమాధవి మాట్లాడుతూ.. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమాలలో అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన మింది శ్రీనివాస్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆ పరమశివుడు వారికి, వారి కుటుంబానికి అన్నివేళలా శుభాలను ప్రసాదించి వారికి ఆయురారోగ్యాలు, ధన ధాన్యాలు, సుఖసంతోషాలను కలగజేయాలని మనస్ఫూర్తిగా ఆ మహాదేవుని ప్రార్థిస్తూ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అన్నదాన సేవా కార్యక్రమంలో మింది శ్రీనివాస్ సోదరుడు మింది శివ, కుటుంబ సభ్యులు ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు అభినందనలు



**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన పార్స్ అధ్యక్షులు యారగొర్ల రామారావు బుల్లెట్ రికవరీ చేయడంతో పోలీసులకు అభినందనలు తెలిపారు. శనివారం నాడు రామారావు మిత్రబృందం గవర్నమెంట్ ప్రెస్ ఎన్ శరత్ చంద్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య తదితరులు సిఐ హనిష్,ఎస్సై పండు దొర, పోలీస్ సిబ్బందిని అభినందించారు. దొంగిలింపబడ్డ తన బులెట్ చేతికి రావడంతో సంతోషంగా ఉందని రామారావు తెలిపారు.

## కోవెలమూడి సురేష్ జన్మదిన వేడుకలు



**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్:** టీడీపీ సీనియర్ నాయకులు కోవెలమూడి సురేష్ జన్మదిన వేడుకలు నర్వనేని అతిథి గృహంలో ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం పట్టణ శివారు అతిథి గృహంలో శాలువా, బొకే అందజేసి అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్వనేని మురళి, చెన్నుపాటి శివయ్య, వేజెళ్ల వంశి, శివాజీ, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ - జనసేన నేతలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** టీడీపీ–జనసేన పార్టీ ఉమ్మడి కార్యాచరణ పై మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, కొల్లు రవీంద్ర నివాసంలో ఇరువురు మర్యాదపూర్వకంగా కలుసుకొని చర్చించారు.

## స్వామి వారికి ఘనంగా మహాన్యాస పూర్వక పురుష సూక్త రుద్రాభిషేకం



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** ఎస్ ఎన్ గొల్లపాలెంలో వేంచేసి యున్న శ్రీ ఉమా సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాస దీక్ష ఉత్సవములలో భాగంగా ఆదివారం పదమూడవ రోజు ప్రాతఃకాల మందు స్వామి వారికి మహాన్యాస పూర్వక పురుష సూక్త రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని,అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేసి తీర్ధ ప్రసాదములు స్వీకరించారు.

## మల్లవోలు ఎస్సీ కాలనీలో సెమీ క్రిస్మస్



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మల్లవోలు ఎస్సీ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాధ్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

## వైభవంగా కోటి దిపోత్సవం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలో కోటి దిపోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున భక్తులు వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మండల పరిధి లోని దక్షిణచిరువోల్లంక, మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణానదిపాయల నడుమ స్వయంగా వెలసిన బాలశివ శంకర్ భగవాన్ ఆలయంలో ఆలయ నిర్వాహకురాలు గుడిసె విజయలక్ష్మీ వేకువ జామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కోటి దిపోత్సవకార్యక్రమంలో పాల్గొని శివలింగం, త్రిశూలం, స్వస్థిక్ వంటి పలు ఆకృతిలో ప్రమిదులను ఏర్పాటు చేసి కోటి దిపోత్సవం నిర్వహించి స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దివిసీమకు కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న గ్రామదేవత లంకమ్మ అమ్మవారి ఆలయంలో సహస్ర దిపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, పాలక మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వా హాణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆద్వర్యంలో అవనిగడ్డ నలుమూలల నుండి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి వారి దిపోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను యార్లగడ్డ శ్రీనివాసరావు, అన్నపరెడ్డి రామదాసులు స్వయంగా పర్యవేక్షించారు. మండల పరిధిలోని పులిగడ్డలో వేంచ్చేసి ఉన్న అలివేలు మంగరాజ్యలక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ, భక్తులు నేత్రానందంగా విజయవంతంగా నిర్వహించారు.



## మంచినీటి ట్యాంకును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**వత్సవాయి నవంబర్ 26 మేజర్ న్యూస్ :** మండలంలో ఇందుగుపల్లి గ్రామానికి విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ ఎంపీ నిధులతో మంజూరైనా మంచినీటి సరఫరా ట్యాంకర్ ను ఆ గ్రామానికి మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, సర్పంచ్ మొల కృష్ణారావు, ఎంపిటిసి చావా నాగేశ్వర రావు చేతుల మీదుగా ప్రారంభించి గ్రామానికి అందచేశారు. సోమవారం జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామంలో బ్రహ్మంగారి కళ్యాణం, అన్నదాన కార్యక్రమం జరుగుతుందని అ కార్యక్రమానికి మంచినీటి సరఫరా కోసం ఈ ట్యాంకర్ ను మల్కాపురం గ్రామానికి పంపించాలానే ఉద్దేశ్యంతో ఆదివారం ప్రారంభించడం జరిగిందని తెలియజేసారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కరించే అంశంలో భాగంగా మంచినీటి సరఫరా ట్యాంకును ఎంపీ నాని అందించారన్నారు. భవిష్యత్తులో ఎటువంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ ను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హరి మల్లేశ్వర రావు, చావా శంకర్ రావు, తేలు కుంట్ల శ్రీనివాసరావు, మొల శ్రీనివాసరావు, మొల వెంకట్రాములు, కోనంగి పెద్ద కృష్ణారావు, మాతంగి రాజేష్, పెద్ద పోగు ముక్కంటి, నాయిని నరసింహారావు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### వాడవాడలా రాజ్యంగ దినోత్సవ వేడుకలు



**కృత్తివెన్ను నవంబర్ 26 మేజర్ న్యూస్ :** మండల పరిధిలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆయా గ్రామాల పరిధిలో జై భీమ్ ఆర్మీ కమిటీ తోపాటు పలువురు నాయకులు అధికారులు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని స్మరించుకున్నారు. మన దేశం మన పాలన అనే దిశగా రాజ్యాంగాన్ని నిర్మించడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కొంతమందికే రాజ్యాధికారం దక్కే రోజుల్లో నుంచి అణగారిన వర్గాల వారికి సైతం రాజ్యాధికారం దక్కాలని ఆలోచన చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ అని తెలిపారు. కొంతమంది అంబేద్కర్ కొన్ని వర్గాల వారికి పరిమితం చేయడం వల్ల అంబేద్కర్ దేశం కోసం చేసిన సేవలను మరుగున చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నారని జై భీమ్ ఆర్మీ కమిటీ గౌరవ అధ్యక్షులు సాదే రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా భారతదేశ పరిపాలనలో అంబేద్కర్ తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఈరోజు మహిళలు 50% అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారు అంటే కారణం అంబేద్కర్ విధానాలేనని కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఒడుగు తులసిరావు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం రచించడం పట్ల వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారం దక్కుతుందని అంబేద్కర్ కాకుండా వేరే ఎవరైనా వెనుకబడిన వర్గాల వారికి మొండి చెయ్యి ఉండేదని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు, పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఆర్మీ కమిటీ సభ్యులు కాలాబత్తుల హేమాచలం, వెంకటరత్నం, రాజ్ కుమార్, సీతనపల్లి సచివాలయ కన్వీనర్ చింతల మోజేష్, గోపి, సురేష్, రమేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం



**నందిగామ, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అంబారుపేట గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ జనసేన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి చేకూరే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక జనసేన తెదేపా నేతలతో కలసి షూరిటీ బాండ్లను ప్రజలకు మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అందజేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ అనుమతులు లేని అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజలలో చైతన్యం రావాలి.మన గ్రామాల ప్రకృతి సంపదను అధికార పార్టీ చీకటి నేరగాళ్లు పక్క రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు.అధికార పార్టీ నేతలు చేస్తున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టమని అధికారులకు చెబుతుంటే మా మాటలను పెడచెవిన పెడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తిరిగి మాపైనే కేసులు పెడుతూ వికృతానందం పొందుతోంది. వైసీపి పార్టీ విధానాలు వారి పరిపాలనకు విరక్తి చెంది బాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తాఉన్నారు.యువనేత నారా లోకేష్ పాదయాత్ర త్వరలో ప్రారంభమవుతుంది.రాష్ట్రస్థాయిలో సైకో జగన్ రెడ్డి పరిపాలనను ఎండగడతాం,తెదేపా జనసేన సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనార్థం అత్యంత అవసరం అన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్, ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు(బుజ్జి) ఉన్నం అప్పారావు ఐలపోగు వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఐల పోగు ప్రశాంత్, చుండు వాసు, మంచాల మాధవ, పావులూరి వేణు, టంగుటూరి కామేశ్వరరావు, కామసాని స్వామి,ఐలపోగు విజయ్, ఐలపోగు భాగ్యలక్ష్మి,తెలుగు యువత చుండు సాయి,తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

**వత్సవాయి: నవంబర్ 26 మేజర్ న్యూస్** మండల కేంద్రంలో లింగాల గ్రామంలో ఆదివారం విజయవాడ డా. ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యుల బృందంచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని జయప్రద పౌండేషన్ వారు తెలియజేశారు. పౌండేషన్ వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఎన్ని సార్లు వేర్వేరు ట్రస్టులు వారు ఎన్ని క్యాంపు నిర్వహించిన ఈ క్యాంపుకి ఇంతటి విశేష స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు. సుమారుగా 500మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 300 మంది కళ్ళజోళు ,105 మందికి ఆపరేషన్ అవసరం కాగా వారికి గురువారం కళ్ళ జోళ్ళు ఇచ్చి, ఆపరేషన్ అవసరమైన వారిని విజయవాడ ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్తామని జయప్రద పౌండేషన్ వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది,వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.




# దాతలు చంద్ర కుటుంబానికి సాయం





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక కుమారుడి హాస్టల్ ఫీజు కూడా కట్టలేని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకున్న చంద్ర కుటుంబానికి దాతలు సాయం అందిస్తున్నారు. ఎం.సి.పి.ఎల్ సిటీ కేబుల్ రిపోర్టర్ చల్లపల్లికి చెందిన కళ్ళేపల్లి చంద్ర ఈ నెల 11 వ తేది చల్లపల్లి లోని ఎం.డి.ఓ కార్యాలయం వద్ద ఆత్మహత్య చేసుకోవడంతో దాతలు స్పందిస్తున్న తరుణంలో పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం డి.ఇ రవికిరణ్, డ్రైనేజి డి.ఇ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఎ.ఇ లతో కలిసి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ సభ్యులు కోట సుబ్బారావు, రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, సింహాద్రి జయరామ్ ద్వారా ఈ మొత్తాని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎ.ఇ లు రవి తేజ, విజయ్ కుమార్, ప్రసాద్, డ్రైనేజీ ఎ.ఇ లు చిరంజీవి లు పాల్గోన్నారు. శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సొసైటీ కార్యాలయంలో ప్రస్ క్లబ్ సభ్యులు కోట సుబ్బారావు, కోట యూరిగగారిన్, ఇమ్మడిశెట్టి రామారావులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రేమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గోన్నారు. జనసేన పార్టీ సభ్యులు పంచాయితీ పరిధిలోని 8 వ వార్డుకు చెందిన చింతా కోర్నెల్ గుండె జబ్బుతో మరణించగా విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ నాయుడు కోర్నెల్ ఇంటికి వెళ్ళి భౌతికాయాన్ని సందర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయల నగదును వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో డి భాస్కర్, నాగమల్లి, సి కుమార్. ఎం ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గోన్నారు. దుడ్డు మురళి అవనిగడ్డ లో 2 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, కోడూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు కంచర్లపల్లి నాంచారయ్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో తోట దామోదర్ లతో పాటు పలువురు జనసైనికులు పాల్గోన్నారు.

# రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రథమ కార్యాలయం లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ పటాలకి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగం భావం, అందరూ గుర్తుచేసుకూవాలనే ఉద్దేశ్యంతో కమిషనర్, కార్పొరేషన్ సిబ్బంది అందరూ సామూహికంగా రాజ్యాంగ పీఠికను చదివారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మన భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని. భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్ట్ 15న వచినప్పటికి. మన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పలువురు విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేసి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడమంటే అంత సులువు కాదు కాబట్టి అందుకే రెండేళ్లకు పైనే సమయం పట్టిందిని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందిందని. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది అని,. అందుకే ఆ రోజున గణతంత్ర దినోత్సవం జరుపుకొంటారని. అయితే రాజ్యాంగానికి ఆమోదముద్ర పడింది మాత్రం గణతంత్ర దినోత్సవానికి సరిగ్గా రెండు నెలల ముందు. అంటే 1949 నవంబర్ 26న అని, రాజ్యాంగంలో ఉన్న ప్రతి విషయం అందరికీ కచ్చితంగా తెలుసుకోవాలని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల గురించి గుర్తు చేసుకోవడానికోసమే భారత రాజ్యాంగ దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (జనరల్) కే.శకుంతల మాట్లాడుతూ, 200 సంవత్సరాల బ్రిటిష్ పరిపాలన తరవాతా ఆగస్ట్ 15, 1947న, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని. భారత ప్రజలమైన మనము, మనకు మనం రాజ్యాంగాన్ని రచించి ఆమోదించింది నవంబర్ 26, 1949 న అని, ఈరోజు మనం అనుభవిస్తున్న వివిధ రకాల హక్కులు అది రాజ్యాంగం కల్పించింది అని, భారత రాజ్యాంగం ప్రకారం అందరూ సమానులేనని, భారతదేశం రాజ్యాంగం అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగంగా కొనడుతుందంటే అది రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు ద్వారానే అని, ఇటువంటి విశిష్టమైన రోజుని జరుపుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఈ వేడుకల్లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే. సత్యవతి వియంసి మేనేజర్ బి శ్రీనివాస్, కార్పొరేషన్ ఇబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ప్రపంచ మేధావి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం స్థానిక జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్వో) కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డీఐపిఆర్వో యు.సురేంద్రనాథ్.. కార్యాలయ అధికారులు సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగంలో పొందుపరచిన పీఠికను చదివి అందరితో మననం చేయించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ మాట్లాడుతూ డా. బి.ఆర్.అంబేద్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడి, వివిధ దేశాల రాజ్యాంగాలన్నిటినీ అధ్యయనం చేసి మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందిచారన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ, పౌరులుగా మనకు నిర్దేశించిన బాధ్యతలను ప్రతి ఒక్కరు నిబద్ధతతో పాటించడమే మనం ఆ మహనీయునికి అర్పించే నిజమైన నివాళులని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో ఎస్.వి.మోహన్ రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పీఆర్వో వీవీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ, భవాని మహేష్, శ్రీనివాస్, జ్యోతి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో జ్వాల తోరణం పూజ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాల తోరణం పూజ కార్యక్రమంనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బి సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటులన్నీ దగ్గర ఉండి చూసుకున్నారు.

## అరుణాచల నామస్మరణతో.. సకల పాపాలు తొలుగుతాయి



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** శ్రీ రమణ కేంద్రం మచిలీపట్నం వారి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక కృత్తిక దీపోత్సవాన్ని పురస్కరించుకుని సాగర తీర శ్రీ రమణ కేంద్రం నందు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కృత్తిక దీపాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వెలిగించి, అరుణాచల నామస్మరణతో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆధ్యాత్మికవేత్త ఐ.శోభనాద్రి ఈశ్వరరావు మాట్లాడుతూ కార్తీక మాసం శివునికి ఎంతో ప్రీతికరమైనది అన్నారు. తమిళనాడులోని అరుణాచల క్షేత్రంలో కొండపై కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని కృత్తికా కార్తీక దీపాన్ని వెలిగిస్తారని ఆ దీప దర్శనం కోసం లక్షల మంది వేచి చూస్తారు అన్నారు. అందులో భాగంగానే అరుణాచలం వెళ్లలేని భక్తుల కోసం శ్రీ సాగర తీర రమణాశ్రమంలో శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, కృత్తిక కార్తీకదీపం వెలిగించడం జరిగింది అన్నారు. అరుణాచల నామ స్మరణ చేస్తే సకల పాపాలు తొలగుతాయి అన్నారు. అరుణాచలంలో చేసే గిరి ప్రదక్షణ ఎంతో పరమపవిత్రమైందని, ప్రతి వ్యక్తి అరుణాచల గిరి ప్రదక్షిణ చేసి సకల పాపాలను తొలగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రమణ కేంద్రంసభ్యులు, జీవీ రమణ, కే దేవేంద్ర ప్రసాద్, అద్దేపల్లి గోపికృష్ణ, పి. వి. ఫణి కుమార్ తదితరులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాదవ్ సోదరులు ఆత్మీయ కలయికలో ఎంపీ



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ఎంపీ బాలశౌరికి మచిలీపట్నం పురవీధుల్లో భారీ ఊరేగింపుతో యాదవ్ సోదరులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం యాదవ సంఘం సభ్యుల ఆత్మీయ కలయికలో పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. బాలశౌరి యాదవ కళ్యాణ మండపానికి సిఎస్ఆర్ నుండి కోటి రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమం లో రొండి క్రిష్ణయాదవ్, యాదవ సంఘం నాయకులు, యాదవ సోదరులు పాల్గొన్నారు.






## ఆర్టీసీ బస్సు ఢీకొని అయ్యప్ప భక్తుడు మృతి



(ఫైల్ ఫోటో)

**కంచికచర్ల నవంబర్ 26 మేజర్ న్యూస్ :** స్థానిక కంచలమ్మ గుడి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది సేకరించిన సమాచారం ప్రకారం కంచికచర్లకు చెందిన విశ్వేశ్వరరావు అనే వ్యక్తి అయ్యప్ప మాల ధరించి ఉన్నాడు ఆదివారం సాయంత్రం శివ సాయి క్షేత్రానికి వెళ్లి పూజ నిర్వహించుకొని తిరిగి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చిన జగ్గయ్యపేట డిపో కి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు స్థానిక పోలీసు వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్యాంగం పట్ల బాధ్యతగల పౌరులుగా మెలుగుదాం



**మొవ్వ మేజర్ న్యూస్:** దేశ ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం అందిస్తూ రూపొందించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ బాధ్యత గల పౌరులుగా మెలుగుదామని కృష్ణా జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పాగోలు జ్యోతిబసు ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం మండల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పెదపూడి– కూచిపూడి సెంటర్లో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృ త్వం రాజ్యాంగానికి మూల స్తంభాలని, అన్ని వర్గాల సంక్షేమం, అభ్యుద యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, దేశ పౌరుల హక్కులు, విధులు తెలియజేస్తూ దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ ఏర్పాటు చేసేందుకు డా. బి.ఆర్. అంబేద్కర్ సారధ్యంలో భారత రాజ్యాంగం నిర్మించబడిందని అన్నారు. పరాయి పాలనలో మగ్గుతున్న దేశ ప్రజలకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, భావితరాలకు రాజ్యాంగ స్ఫూర్తిని నింపే విధంగా మెలగాలని జ్యోతిబసు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అంబేత్కర్ యూత్ నాయకులు కే. రాజేంద్ర, బండి. సహదేవుడు, కే. బాలకృష్ణ, వరిగంజి. నాగేంద్రం, వి. రవి బాబు ఏ రవి పి రమేష్ బాబు, కే రామారావు సుబ్రహ్మణ్యం కే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 30న నుండి జాబ్ మేళా

**విజయవాడ, మేజర్ న్యూస్ :** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలిపించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలిపించాలనే దిశగా రాష్ట్ర పభ్రుత్వం ఆధ్వర్యంలో – కె.బి.యన్ కాలేజీలో ఈనెల 30వ తేదీ ఉదయం 09:00 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించబడును అని, ఈ అవకాశాన్ని ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ, బి–టెక్, ఫార్మసీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన విద్యార్థులు ఈ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలసిందిగా, skilluniverse.apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోగలరని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జాబ్ మేళాలో వివిధ రంగాలకు సంబంధించిన 16 కంపెనీ ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ జాబ్ మేళాకి వచ్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయబడును ని ఇతర వివరాలకు 63019 90597, 97000 92606, 90326 33548లో సంప్రదించగలరని కలెక్టర్ ఢిల్లీరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం (27.11.2023) ఉదయం 10: 00 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 9.30 గంటలకు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను గ్రామ,వార్డు సచివాలయం, మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించవచ్చునని కలెక్టర్ డిల్లీ రావు ఆ ప్రకటనలో తెలిపారు.

# లింగ వివక్షతపై స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం



**గన్నవరం, నవంబర్ 26, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి మీటింగ్ హాలులో లింగ వివక్షత పై స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఎం.పి.డి.ఓ జి.ఎస్.వి శేషగిరిరావు మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టేందంటే ఇంటికి మహా లక్ష్మి వచ్చిందని సంబరాపడతారు.బుడి బుడి అడుగులతో ఇల్లంతా తిరిగుతూంటే సందడి అంత ఇంత కాదు కానీ బాలికలకు సరియైన వయస్సు రాక ముందే పెళ్లి చేసి తమ భారం దించుకోవాలి అని కొంత మంది తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. చదవుకునే వయస్సులోనే వివాహ బంధం పేరుతో బంధనం వేస్తున్నారు. ఆలోచించకుండా ఉన్నత చదువులు చదివించకుండా, ఉద్యోగాలు చేయనియకుండా మైనారిటీ తీరక ముందే పెళ్లి చేసి చిన్నారుల జీవితలతో ఆడుకుంటూన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలకు అడ్డు కట్ట వేసేనందుకు చర్యలు తీసుకుంటుంది. సరియైన వయస్సు వచ్చిన తరువాతే పెళ్లి చేయాలనీ తల్లిదండ్రులకు, బంధువులకు అవహగన కల్పించడంతో పాటు బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలు వారికి వివరించాలి అని తెల్పినారు. అడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 వయస్సు దాటిన తరువాతే వివాహం చేయాలి అనే నిబంధనలు ఉన్న కొంత మంది తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదని తెల్పినారు.బాల్య వివాహాలు చేయడం వలన బాలికలలు రక్తహీనత గురికావడం, అనారోగ్యకర శిశువులకు జన్మనివ్వడం లాంటి అనర్ధాలు జరుగున్నాయని, అడ పిల్లలకు 18 వయస్సు దాటినా తరువాత పెళ్లి చేసే రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ మస్తు లాంటి పధకాలు కుడా వర్తిసాయి. బాలిక విద్యను పోత్సహించే వారే భవిష్యత్తులో బాటలు వేసుకొంటారు అని తెలియ చేసిన్నారు. ఈ కార్యక్రమములో ఇ.ఓ (పి.ఆర్ & ఆర్.డి) ఎం.అమీర్ బాష, ఎ.పి.ఎం ఎం.సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు, సి.సి.లు, వి.ఓ లు, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం





**జగ్గయ్యపేట నవంబర్ 26 మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలో 13వ వార్డు రంగస్వామి బజారులో బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం తాతయ్య మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతయ్య ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పతకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం వార్డులో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో తాతయ్య మాట్లాడుతూ మన రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలన్నా, బావి తరాల భవిష్యత్తు బాగుపడాలన్న ఒక్క చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.అందుకోసం మనమం దరం సమిష్టిగా సైకో వైసీపీ ప్రభుత్వం పై పోరాటం చేస్తూ టీడీపీ విజయానికి కృషి చేస్తూ సీఎంగా చంద్రబాబునాయుడును గెలిపించుకావాలన్నారు.ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, షేక్ బాషా,గెల్లా వైకుంఠేశ్వరరావు, కర్నాటి రమేష్, మారేపల్లి శౌరి, మొగిలి శ్రీనివాసరావు, కాటగాని స్వామి, బత్తుల శ్రీను, మల్లెల గొల్ల, దాసరాజు సైదులు, తుమ్మ వీరేష్, ఏనుగుల సాయి, తుమ్మ శారద, ఏనుగుల సీతారావమ్మ, దాసరాజు తదితరులు పాల్గొన్నారు.





## శివనామ స్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలోని శైవక్షేత్రాలు శివనామస్మరణంతో మారుమోగాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు కృష్ణానదిలో పుణ్యస్ధానాలు ఆచరించి శైవక్షేత్రాలకు తరలివెళ్ళి కార్తీక దీపాలను వెలిగించారు. రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి దేవస్థానంలో ఆలయ అర్చకులు ఘంటశాల సంతోష్ పవన్ శర్మ ఆద్వర్యంలో స్వామి వార్లకు వేకువ జామునే ప్రత్యేక పూజలు అర్చనలు, నవవిధ అభిషేకాలు నిర్వహించి స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎక్కువ మందికి పౌర్ణమి నోములు ఉండటంతో నోములు అనంతరం ఆలయానికి రావడంతో భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. భక్తుల శివనామస్మరణలతో దివిసీమ దద్దరిల్లింది. మండల పరిధిలోని వేకనూరు ఉభయ ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ఆవరణలోనూ మరియు ఆవరణలో గల ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలను వెలిగించడంతో దీపకాంతులతో దేవాలయం దగదగ మెరిసిపోయింది. దక్షిణచిరువోల్లంకలోని శివాలయంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి స్వామి వార్లను దర్శించుకుని తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా నేషనల్ లా డే



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత కూనపరెడ్డి ప్రసాదరావు (నానీ) మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ వంటి మేధావులు దేశ ప్రజలు ఏర్పాటు చేసిన వరమని అన్నారు. ప్రపంచ దేశాలలో భారత దేశ రాజ్యాంగానికి అత్యున్నత విలువలు ఉన్నాయని అన్నారు. అందరూ రాజ్యాంగానికి లోబడి పరిపాలన సాగించాలని. అన్ని చట్టాలు రాజ్యాంగానికి లోబడి అమలు చేయాలని అన్నారు. ఎంతో పురాతనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌లో సన్మానం పొందటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రసాదరావు తెలిపారు. మరో సన్మాన గ్రహీత సీనియర్ న్యాయవాది కొల్లిపర రమణమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి న్యాయమూర్తులు న్యాయవాదులే రక్షకులని అన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడాలని అన్నారు. అన్ని వ్యవస్థను రక్షించే నిఘంటువు రాజ్యాంగం అని అన్నారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా సీనియర్ న్యాయవాదులను గౌరవించడం అనే సాంప్రదాయాన్ని ఎంతో కాలంగా మచిలీపట్నం బార్ కొనసాగిస్తుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు న్యాయవాదులందరూ కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పుప్పాల ప్రసాదు, మాజీ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.పీ. కొండయ్య, కొండపల్లి వేణుగోపాల్ రావు తదితరులు భారత రాజ్యాంగం గురించి ప్రసంగించారు. అనంతరం సీనియర్ న్యాయవాదులను సన్మానించి, అంబేద్కర్ పటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు.

## గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం రాజ్ భవన్ లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

## అరుణాచలంకు 13వ నెల ప్రయాణికులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నియోజకవర్గ ప్రాంతం నుండి ప్రజలు, భక్తులు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి డిపో వారు ఏర్పాటు చేసిన అరుణాచలం ప్రత్యేక సర్వీసుకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాత్రి 13 వ నెల ప్రయాణికులతో బయలుదేరి వెళ్ళింది. కార్తీక మాసంలో పలు ప్రాంతాలకు దేవాలయాలకు నడుపుతున్న ఆర్.టి.సి బస్సులను ప్రజలు, భక్తులు ఎంతగానో ఆదరిస్తున్నారని గతంలో ఎన్నడు లేని విధంగా పుణ్యక్షేత్రాలను దర్శించడంలో ప్రజల్లో మార్పు వచ్చిందని ఆదివారం డిపో మేనేజర్ కె హనుమంతురావు చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా ఆర్.టి.సి బస్సులను ఆదరించి సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణాలను చేయాలని కోరారు.

## రాయపూడి ఆరోగ్య విషయాలు తెలుసుకుని నిబ్బరంగా ఉండాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జనసేన రాష్ట్ర నాయకులు రాయపూడి వేణుగోపాల్ ఆరోగ్య విషయాలు తెలుసుకుని నిబ్బరంగా, ధైర్యంగా ఉండాలని అన్నారు. జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆరోగ్య పరిస్థితి ఆగస్టు 20 నుండి సరిగా ఉండక పోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటివలె ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర నాయకులు శివశంకర్, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అక్కల రామోహన్ గాంధీ, ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు చౌదరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిన హరిరామ్, పండలనేని శ్రీనివాస్, పిరటి కనుమూరి, జనసేన నాయకులు తుంగల నరేష్, కమతం నరేష్, ఉల్లి శేషగిరి, గాదే రమేష్, తోట ఆంజనేయులు, భోగాధి శివవిష్ణు మిత్ర బృందం, వీరమహిళలు, జనసేన కుటుంబ సభ్యులు ఆదివారం రాయపూడి నివాసానికి వెళ్ళి ఆరోగ్యంపై ఆరా తీసి తెలుసుకుని మనో నిబ్బరంతో ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా పేరు పేరునా రాయపూడి ధన్యవాదాలు తెలియచేశారు.

**17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.**

ఇట్లు **ఎన్.వెంకటే్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999